# రక్షణ మహా సంకల్పన

దేవుడు మానవులకు ఏవిసిద్ధపరచునో, యిప్పుడేవి సిద్ధపరచు చున్నాడో యిక ముందునకేవి సిద్ధపరచనైయున్నాడో యీ మూడు విషయములు రక్షణ మహాసంకల్పనలో ఇమిడియున్నవి. వీటికి బైబిలుమిషను ఆధారము కొన్నింటిని పొందుపర్చుడమైనది.

**1. దేవలోకము:-** ఇది మన ఊహకందనంతపైగా నున్నది. పరిశుద్ధ లక్షణములు గల దేవునికి సింహాసనమిక్కడ గలదు. ఆయన సర్వవ్యాప్తియై పరిపాలించుచున్నాడు ఆయనే మన తండ్రియునై యున్నాడు యెషయా 6.

**2. దేవదూతల లోకము:-** వీరున్ను దేవునివలె పరిశుద్ధులును, మానవాకారములు గలిగి పక్షులవలె రెక్కలు గలిగినవారు, మన స్నేహితులు, కావలి బంటులు దేవుని సన్నిధిలో నున్నవారు యోబు 38:7.

**3. మోక్షలోకము:-** ఈ భూమిమీద భక్తిగా జీవించి రక్షింపబడినవారు; యీ స్థలమునకు వచ్చి, శాశ్వతానందభరితులుగా దేవుని ముఖమును జూచుచుందురు. భక్తిలో అంతస్తులున్నట్లు యిక్కడకూడ అంతస్తులుండును (1కొరింథీ 15:23).

**4. వాయుమండలలోకము:-** దేవుని నెదిరించిన దేవదూత సాతానుగామారి, తన సహదూతలతో ఇక్కడకు వచ్చివేయవలసి వచ్చెను అతనికే సైతానని పేరు (ఎఫెసీ 6:12).

**5. నరలోకము:- (ఆది 1:1)** దేవుడు ఆదియందు పవిత్రములైన ఆకాశమును, భూమిని వాటిలోని సమస్తమును పరిశుద్ధులగు ఆది దంపతులను కలుగజేసెనుగాని వారు సాతాను

మాయమాటలు విని పాపములో పడిపోయిరి. అప్పుడు దేవుడు వారిని రక్షకుని పంపెదనను వాగ్దానమిచ్చెను. దేవుడు కనబడనందున కొందరు ఉపకార సృష్టిని పూజించిరి. కొద్దిమందియన్ననో దేవునే పూజించిరి. జనములు పెరుగగా పాపమును పెరిగెను. వాగ్దాన పురుషుడు జన్మించుటకు దేవుడు యూదుల జనాంగము నేర్పుర్చు కొని వారికే మొదట సమస్త ధర్మములను బోధించెను. నాలుగువేల యేండ్లు గడచిపోగా దేవుడే నరుడుగా కన్యయొక్క గర్భమందు జన్మించి, లోకైక రక్షకుడను అర్ధమిచ్చు యేసుక్రీస్తు అను దేవలోక నామముతో ప్రత్యక్షమాయెను, ఆయన మన నిమిత్తమై చేయవలసిన సమస్త కార్యములు ముప్పది మూడున్నర సంవత్సరములలో ముగించి, సర్వలోక పాపపరిహారార్ధమై యజ్ఞమై మరణమును జయించి ఆరోహణ మాయెను, ఆయన మిక్కిలి త్వరలో వచ్చి సంఘమును ప్రాణముతో తీసికొనివెళ్ళిన వెంటనే, శేషించిన వారిని యేడేండ్లు సైతానుయొక్క ప్రతినిధియగు అంతెక్రీస్తు అను బిరుదుగల విరోధి బాధించును. అప్పుడు నూటనలుబది నాలువేలమంది యూదులును, కోటానుకోట్ల యితరులును దేవుని తట్టు తిరుగుదురు. పిమ్మట మోక్ష లోకములోనుండి క్రీస్తు వచ్చి పాలెస్తీనాలోని హర్మగెద్దోను అను స్థలమందు యుద్ధముచేసి, విరోధిని అతని సహకారులను నరకములో పడవేసి, సాతానును వెయ్యేండ్లు పాతాళపు చెరలో బంధించును. అప్పుడు క్రీస్తును తన భక్తులును యీ లోకమునకే వచ్చి శాంతిపరిపాలన చేయుదురు. పిదప సాతానును, దయ్యములును దుష్టులును నుండరు గనుక విషపు పురుగులును, అపవిత్రత స్థలములును, వ్యాధులును, తరుచు మరణములును, యెట్టి విధములైన బాధలును ఉండవుగాని పాప నైజముగల వారుందురు. వారికే పరలోక వాస్తవ్యులు బోధ చేయుదురు. భక్తులకును, భక్తిహీనులకును వెయ్యేండ్ల పాలనలో

మహా సౌఖ్యము గలిగియుండును. పరిపాలనలో బోధ విన్నవారు ఏమి తీర్మానించుకొనిరో దానిని చెప్పించుటకు క్రీస్తు సింహాసనము వేసికొని తీర్పు విధించును. పిమ్మట సాతానుకు విడుదలకాగా అతడుగ్రుడై దేవునితో పోట్లాడి, ఓడిపోయి నరకములో పడద్రోయబడును. నమ్మనివారుకూడ త్రోయబడుదురు. **ఎవరైనను నరకములోనికి వెళ్ళుటకు కారణము వారి వారి పాపమేగాని దేవుడు కాడు.** నరక కాలము కడవరి తీర్పు కాలము, ఇది రాకముందు నరుల మార్పుకొరకు యెన్నోమార్లు గడువు లియ్యబడును. తుదకు మన భూలోకము మోక్షలోకమువంటిదగును. తిట్టుట ద్వేషించుట, పగ వహించుట, దోచుకొనుట, అబద్ధములాడుట, కొట్టుట, చంపుట యీ మొదలగు పాపములు చేయు వానికి పాపములే భూలోక నరకములు, పాపమువలన కలుగు వ్యాధులు, యిబ్బందులు, చిక్కులు, నానావిధములైన కష్టములు, మరణములు యీ మొదలగునవి కూడ భూలోక నరకములే. ఈ మూడు విధములైన నరకములను తప్పించువాడు యేసుక్రీస్తుప్రభువే అని మా స్వానుభవ విశ్వాసము. ఈ మా ఉపకార వ్యాసమునుబట్టి మీకును స్వానుభవ విశ్వాసము కలుగునుగాక!

**6. పాతాళ లోకము:-**

**(1) హేడెస్:-** 1సమూ. 2:6. జనులను సజీవులుగాను మృతులుగాను చేయువాడు యెహోవాయే. పాతాళమునకు పంపుచు అందులోనుండి రప్పించుచుండు వాడాయనే 1పేతురు 4:6 మృతులు శరీర విషయములో మానవరీత్యా తీర్పు పొందునట్లును ఆత్మ విషయములో దేవునిబట్టి జీవించునట్లును వారికికూడ సువార్త ప్రకటింపబడెను. దా.కీర్త. 139:8 నేను ఆకాశమునకెక్కినను నీవు

అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడ ఉన్నావు. లోకములో మారినవారిక్కడ కడవరితీర్పు వరకుందురు మారుటకిది మంచి స్థలము.

**(2) చెర:-** ప్రక 20:2 అతడు ఆది సర్పమును అనగా అపవాదియు, సాతానును అను ఆ ఘటసర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు వానిని బంధించి పాతాళములో పడవేసెను ఇది సైతాను బందించబడిన చెర.

**(3) నరకము:-** ప్రక. 20:11-15 మరియు ధవళమైన మహా సింహాసనమును, దానియందు ఆసీనుడైయున్న యొకనిని చూచితిని. భూమ్యాకాశములు ఆయన సముఖమునుండి పారిపోయెను. వాటికి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్పవారైమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము యెదుట నిలువబడియుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమును వేరొక గ్రంథమును విప్పబడెను. ఆ గ్రంథమములయందు వ్రాయబడియున్న వాటినిబట్టి తమక్రియల చొప్పున మృతులు తీర్పు పొందిరి. సముద్రము తనలోనున్న మృతులను అప్పగించెను. మరణమును మృతుల లోకమును వాటి వశముననున్న మృతుల నప్పగించెను. వారిలో ప్రతివాడు తనక్రియల చొప్పున తీర్పుపొందెను. మరణమును మృతుల లోకమునకు అగ్నిగుండములో పడవేయబడెను. ఈ అగ్నిగుండము రెండవ మరణము ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడెను.

క్రీస్తు విరోధి, అతని యనుచరులు, పిశాచములు సైతాను, నమ్మనివారు తుదకు వెళ్ళవలసిన స్థలము.

# దైవ ప్రార్థన చేయవలసిన క్రమము

నా నామమును బట్టి మీరు నన్నేమి అడిగినను నేను చేతును అనియు, అడుగుడి మీకియ్యబడును అనియు యేసుప్రభువు చెప్పుచున్నాడు. యోహాను 14:14, మత్తయి 7:7.

**1. మనోనిదానము:-** నీ గదిలోనికివెళ్ళి ఏకాంతస్థలమందు ప్రభువు సన్నిధిలో మోకరించి ఆయనను మాత్రమే తలంచుకొనవలెను, మంచివాటినిగాని, చెడ్డవాటినిగాని తలంపులోనికి రానీయకూడదు. వచ్చినయెడల విసర్జింపవలెను.

**2. నమస్కారము:-** ఇట్లు చేసినప్పుడు యేసుప్రభువు నీయెదుట నున్నాడనియు, నీ ప్రార్థన వినుటకు వచ్చినాడనియు నమ్మి ఆయనకు నమస్కరింపవలయును, అధికారిగాని, స్నేహితుడుగాని గనబడినప్పుడు వందనము చేయుదువుగదా! ప్రభువు వచ్చినపుడు ఆయనకు యెందుకు నమస్కారముచేయకూడదు?

**3) పాపపుటొప్పుదల:-** తలంపులోను, మాటలోను, యత్నములోను క్రియలోనున్న పొరబాట్లు ఒప్పుకొనవలెను. దేవునికిని, మనుష్యులకును, నీకును విరోధముగా చేసిన తప్పులొప్పుకొనవలెను. మరియు జీవరాసులయెడల చూపిన నిర్దయ యను తప్పుకూడ ఒప్పుకొనవలెను. మరియు తత్పూర్వమే మరియొక తప్పు ఒప్పుకొనవలెను. అది యేదనిన, నీవు యెవరి మనస్సయిన నొప్పించినయెడల ఆ మనుష్యునియొద్దకు వెళ్ళలేకయుత్తరము వ్రాసి ఒప్పుకొనవలెను. ఎవరిమీదనైన చాడిచెప్పిన ఒప్పుకొనవలెను.

ఒప్పుకొనినప్పుడు మనసులో వేదనయుండక పోయిన యెడల అది నిజమైన ఒప్పుదల కాదు, వస్తువులను సరిగవాడక పోవుటకూడ నేరమే.

**4. తీర్మానము:-** ప్రభువా! నాలో యిదివరకున్న పొరబాటును యికమీదట చేయను. నాకు తెలిసిన యేపొరబాటును చేయను చేయకుండునట్లు ప్రయత్నింతును అని ప్రభువునెదుట తీర్మానించుకొనవలెను.

**5. సమర్పణ:-** ప్రభువా! నీవునాకిచ్చిన శరీరము, ఆత్మ, యింటిలోని వస్తువులు, ధనము, ఉద్యోగము, పొలము, పశువులు, సమస్తము నీకు సమర్పించుచు, కాపుదల నిమిత్తమై నీ స్వాధీనము చేయుచున్నాను.

**6. మొదటి స్తుతి:-** గడచిన కాలమందు ప్రభువు చేసిన గండముల నిమిత్తమై స్తుతింపవలయును.

**7. రెండవ స్తుతి:-** గడచిన కాలమందు ప్రభువు చేసిన ఉపకారము నిమిత్తమై స్తుతింపవలయును.

**8. అంశ ప్రార్థన:-** ఇప్పుడు నీవు చేయవలసిన ప్రార్థనలు చేయవచ్చును. అనేక వంశములున్న యెడల పట్టునకొక యంశ మును గూర్చి ప్రార్థన చేయుట మంచిది. ఎట్లనగా ఒకనాడు స్వస్థత కావలెననియు, రెండవనాడు అప్పు తీర్చుమనియు, మూడవ నాడు బిడ్డలు కావాలనియు, నాల్గవనాడు యితరులనందరిని కాపాడు మనియు ఐదవనాడు భక్తి స్థిరపర్చుమనియు ప్రార్థింపవచ్చును. ఇవి గాక నీకిష్టమువచ్చిన యంశములన్నిటిని గురించి ప్రార్థింప వచ్చును అన్నియుకలిపి చేయవచ్చును లేక వేరు వేరుగా చేయవచ్చును.

**9. మూడవ స్తుతి:-** ప్రభువా! ఎనిమిది మారులు నీతో మాట్లాడుటకు సెలవిచ్చినావు గనుక నీకు వందనములు అని చెప్పవలెను.

**10. కనిపెట్టుట:-** ప్రభువా! నేను నీకు చెప్పుకొనవలసినవి చెప్పుకొంటిని ఇప్పుడు నీవు నాకు చెప్పవలసినది చెప్పుము నేను విందును, నీవు చెప్పినట్లు నేను చేయుదును అని ప్రార్థింపవలయును. తరువాత ప్రభువు నీ మనస్సులో తలంపులు, జవాబుగా పుట్టించువరకు మోకాళ్ళమీదనే యుండవలయును. ఆయన నీకు కనబడువరకుగాని నీతో స్పష్టముగా మాట్లాడువరకు గాని, మోకాళ్ళమీదనే యుండవచ్చును. తరువాత వందనములు చేసి ఆమేన్ చెప్పి ముగింపవచ్చును. ఈ క్రమము కాక నీ యిష్టము వచ్చిన క్రమము కూడ ఏర్పరచుకొనవచ్చును.

## సూక్ష్మ ప్రార్థన

1. దేవా! నాకు కనబడుము
2. అందరికిని కనబడుము
3. దేవా! నాతో మాటలాడుము
4. అందరితోను మాటలాడుము.

షరా:- 1) దినమునకొకసారియైనను యీ ప్రార్థన చేసి చూడండి మీకు యెంతమేలు కలుగునునో తెలిసికొనగలరు.

2) ఈ ప్రార్థన ఒక కార్డుమీదగాని, ఒక కాగితము మీదగాని వ్రాసియైనను అచ్చువేయించియైనను మీకు వీలున్నప్పుడు యెవరికైనను పంపిచూడండి.

3) ఎవరికైనను నేర్పిచూడండి. ఈ పనులు చేయునప్పుడెల్ల మీకు దీవెన కలుగునని నమ్మండి. ఒక మంచి పనికి వేలు

కలుగకుండునా? మీరు యెన్ని పర్యాయములు యీ పనులు చేసిన యెడల యెవరు వద్దనగలరు?

షరా:- (1) మీకిష్టమైన యెడల చివర మీ పేరును మీ పైవిలాసమును వేయండి.

(2) తారీఖుకూడ వేయండి.

షరా:- దేవా! అని పిలుచుట కిష్టములేనివారు క్రొత్త విషయములు బయలుపడునని నిశ్శబ్దముగా ధ్యానములో ఉండుట మంచిది. ఒకరొక పనిచేయనైయున్నప్పుడు బాగుగా ఆలోచించి, ఆలోచించి ఆ పని మొదలుబెట్టుదురుగదా! ఈ ఆలోచన ధ్యాన కార్యము వంటిది. మరలు, మందులు, ఉపాయములు ధ్యానమువల్ల కలిగినవే గదా! మన దేశ ఋషులకు ధ్యానాభ్యాసము కలదు.

షరా:- నరులు స్వతంత్రులు యెవరి తలంపు వారు చెప్పుకొనవచ్చును బేధమున్నప్పుడు కలహింపరాదు.

# దైవసన్నిధి - సమాజము

దా.కీర్తన 16:11 "నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు".

అన్ని దేశముల క్షేమార్థమైన సర్వాంశములు ఆలోచించుటకై కొన్ని యేండ్ల క్రిందట సర్వదేశ ప్రతినిధులు స్విడ్జర్లాండ్ దేశములో నొక సమాజముగా కూడుకొనిరి దానిపేరు "లీగాఫ్ నేషన్స్". అలాగే యిప్పుడు అన్నిమతముల ప్రతినిధులు యెక్కడనో నొకచోట దైవసన్నిధి సమాజముగా కూడుకొనుట భూగోళమంతటికి శ్రేయోస్కరమైన యుపకారమైయుండును. వారి పని యిట్లుండుట మంచిది.

1. అన్ని దేశముల కష్టములను, అక్కరలును ఒక పుస్తకములో వ్రాసి దైవప్రార్థన చేయవలెను.

2. అన్ని మతములవారును తమతమ సిద్ధాంతములను, మిగుల క్లుప్తముగా వ్రాసి దైవప్రార్థన చేయవలెను (వాదములు పనికిరావు).

3. ఆ ప్రార్థన యీవిధముగా నుండవచ్చును, దేవా! మా మా సిద్ధాంతముల ప్రశ్నలకు స్పష్టమైన జవాబులు వినిపించుము.

షరా:- దేవుడు వినిపించినవి వ్రాసి కాలక్రమేణా అన్ని దేశముల వారికి పత్రికల మూలముగా తెలియపరుపవలెను.

ఈ పనికి ఎవరు పూనుకొందురో!

# బైబిలు విషయములు

## రక్షణ పద్యములు

(1) "ఏదిపాపమొ యది యెత్తిచూపించుచు
గద్దించి నేర్పించు గ్రంథమేది
పాపాత్ములకు మోక్షపథ స్పష్టముంగా
కనపర్చి నడ్పించు గ్రంథమేది
వెయ్యిభాషల నచ్చువేయింపబడినవార్త
గా ప్రచారముచేయు గ్రంథమేది
దేవుండు నొక్కడే దేవావతారుని
కథయు నొకటే యను గ్రంథమేది
క్రైస్తవతమతమేదైవసం । కల్పనంబు
యేసుక్రీస్తె మానవులకు । నిహపరాల
యందు సర్వమైయున్నాడు । అనుచు దెల్పు

గ్రంథరాజంబు బైబిలు । గ్రంథమొకటె

(2) అచ్చుపుట్టినయప్డె అచ్చుబడిన తొలి
గ్రంథమై వెడలిన గ్రంథమేది
వేదాంతపండితుల్ విసుగకుండను యక్ష
రములు లెక్కించిన గ్రంథమేది
వయసు చాలనియట్టి వ్యాఖ్యాన పుస్తకాల్
కల్పించుకొన్నట్టి గ్రంథమేది
అన్నిపదాలకు అన్వయపదాలు
వ్రాయబడినయట్టి గ్రంథమేది
అన్ని గొప్పతనాలకు । అమరలగలది
అన్ని ప్రార్థనములకు । ఔననునది
అన్ని ఖండనలకు నిలిచి । ఆగగలది
బైబిలొక్కటే గాక ఏ । వ్రాతగలదు

# క్రీస్తుప్రభువు విషయము

1తిమో. 1:15 పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది.

దేవుడు నరావతారమెత్తి లోకైక రక్షకుడు అని యర్థమిచ్చు యేసుక్రీస్తు అను నామమున ప్రసిద్ధికెక్కెను. తన ప్రభావము వలన రోగులను స్వస్థపర్చెను. ఆకలిగొన్న వారికి ఆహారమును కల్పించెను. ఆపదలో నున్న వారిని విడిపించెను. భూతపీడితులను రక్షించెను. పాపులకు క్షమాపణ నిచ్చెను. మృతులను కొందరిని బ్రతికించెను. సాతానును, పాపములను, పాపఫలితములగు

వ్యాధులను, యిబ్బందులను, మరణములను జయించెను. మరియు లోక పాపభారమును తనమీద వేసికొనెను గనుక మరణము పొందవలసి వచ్చెను. అయినను బ్రతికి ఆరోహణమాయెను. ఆయన గొప్ప జయశాలి గనుక మనకన్నిటిలో జయము కలిగింపగలడు. ఆయన త్వరలోనే వచ్చి, నమ్మినవారిని చావులేకుండా మోక్షమునకు తీసుకొని వెళ్ళును. చావులేకుండా మోక్షమునకు వెళ్ళగోరువారు పాప విసర్జన చేసి సిద్ధపడండి.

మనుష్యుని కుమారుడు మనుష్యుడేగదా! అలాగే దేవుని కుమారుడు దేవుడే గదా! యేసుక్రీస్తు దేవుని కుమారుడని వ్రాయబడి యున్నది గనుక ఆయన దేవుడే! ఇది మార్చలేము. క్రీస్తుప్రభువు ప్రవక్త మాత్రమే అయియున్నాడని కొందరు నొక్కి చెప్పుచున్నారు. అలాగైనయెడల ఆయన చెప్పినమాటలన్నియు యెందుకు నమ్మకూడదు? మత్తయి, మార్కు, లూకా, యోహాను అను భక్తులు వ్రాసిన సువార్త పుస్తకములో ఆయన మాటలున్నవి. ప్రవక్త అనగా యెవరు? గతకాలములో జరిగిన విషయములు యెత్తి చూపించ గలవాడు, నవీనకాలమందు జరుగుచున్న విషయములను యెత్తి బోధించువాడు: ఇకముందునకు రానైయున్న విషయములనెత్తి ప్రవచించువాడు, గొప్ప బోధకుడు గొప్ప బోధకుడే ప్రవక్త. క్రీస్తు అందరికంటే గొప్ప మానవుడు అందరికంటే గొప్ప దేవకుమారుడు. అందరికంటే గొప్ప బోధకుడు. అందరికంటే గొప్ప ప్రవక్త, అందరికంటే గొప్ప పాపపరిహారకుడు, అందరికంటే గొప్ప వైద్యుడు అందరికంటే పోషకుడు. అందరి కంటే గొప్ప భూతపీడితుల విమోచకుడు అందరికంటే గొప్ప పునరుత్థానదాయకుడు. అందరికంటే గొప్ప మార్గదర్శి. అందరికంటే గొప్ప ఆరోహణ ప్రభువు. అందరికంటే

అన్నిటిలోను యెక్కువ గనుక ఆయనను ఆశ్రయించినపుడే మనకుపకారము గలుగును. చూడండి! ఆయన బోధవలన యిప్పుడన్ని దేశములలో క్రైస్తవులున్నారు. వారు బైబిలు గ్రంథమును బోధించుచున్నారు. మనుష్యుని ఆత్మ యెంత విలువైనది; కానియెడల ఆయన నరుడై కర్ణకఠోరమైన శ్రమల ననుభవింపనేల అట్లనుభవించుటకు దేవునికేమి పట్టినది.

**1. యేసుక్రీస్తు నామార్ధము:-** యేసు అనగా రక్షకుడు. క్రీస్తు అనగా అభిషిక్తుడు, ఏర్పాటైనవాడు. వైశేషికుడు. యేసుక్రీస్తు అనగా మానవులను రక్షించుటకై ఏర్పాటైనవాడు. చదువరీ! ఈ నామమును దాటుకొని వెళ్ళలేవు. ఇది అంత విశాలమైన నామము. నీకే బాధయున్నను రక్షింపగలవాడుండగా ఆయనను దాటివెళ్ళుట యెందుకు? రక్షకులనేకులున్నారని యందువేమో! వారికన్నా మించిన వాడీయనేయని యీపేరునకుగల గూఢార్థము, ఇది ఆయన ప్రవర్తనలో కనబడుచున్నది.

"నీ దేవుడైన యెహోవావలన సూచన నడుగుము. అది పాతాళమంత లోతైననుసరే, ఊర్ధ్వలోకమంత యెత్తైనను సరే.' ఆహాజు- నేనడుగను, దేవుని శోధింపను' అని చెప్పెను. "కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును" యెషయా 7:11-14. క్రీస్తు తన పేరునకు తగినట్లు మారని మృతులున్న పాతాళమునకు వెళ్ళగలడు. మనుష్యులను రక్షించుట కేర్పాటైనవాడు గనుక మనుష్యులున్న ఊర్ధ్వ లోకమునకున్ను, పాతాళలోకమునకున్ను వెళ్ళ సమర్థుడు.

**2) నర నిర్మాణము:-** దేవుడు మన స్వరూపమందు, మన పోలిక చొప్పున నరులను చేయుదుము" అని పలికెను ఆది. 1:26. దేవుడు నిరాకారాడు. అట్లయిన ఆయన పోలికయను మాట కర్థమేమి? ఆయన పావనలక్షణ గణమే ఆయన స్వరూపము. ఆయన లక్షణము లేవనగా: అనంత జీవనము, ప్రేమ, న్యాయము, జ్ఞానము, శక్తి, పరిశుద్ధత, స్వతంత్రత. దేవుడు వీనిని ఆదిలోనే మనుష్యునిలో పెట్టియున్నాడు గాని పాపమువలన నీరసించిపోయినవి. ఆ పాపములను పరిహరించి, మనుష్యునికాస్థితిననుగ్రహించుటే క్రీస్తు వచ్చెను. ఆయన పని యింకను పూర్తికాలేదు. పూర్తియగునప్పటికి మనకా లక్షణములు మరల పూర్తిగా వచ్చును. ఇదెంత కృప! ఇదెంత ధన్యత! ఇది మీక్కరలేదా?

**3) ఉండిపొండి:-** స్వమతము : క్రీస్తు మతమువల్ల కలుగు మేళ్ళు మా మతములోకూడ కలుగును. గనుక మేము క్రీస్తు మతములోనికి రాము అని కొందరనుచున్నారు. ***అట్లు మీకు పూర్తిగా తోచినయెడల మీరు మీమనస్సాక్షి ననుసరించి దేవుడు మీకు కనబడి వేరొక మతమును జూపువరకు మీ మతములోనే యుండిపొండి.***

**4) దేవవ్యక్తి:-** ***దేవుడు కలడనిగాని, లేడనిగాని నిరుకు తెలియనప్పుడు ఉన్నాడని నమ్ముటయే మంచిది. ఉన్నయెడల నీ ప్రవర్తనకు మంచి ఫలితము కలుగును.*** దుష్ప్రవర్తనకు శిక్ష కలుగును. లేనియెడల రెండును కలుగవు. జీవాంతమందు నీకు నిరుకు తెలియును. అప్పుడు దేవుడు లేడనుకున్నాను. ఉన్నాడు అని దుష్టుడు భయపడును. జీవాంతమందు సజ్జనుడు దేవుడున్నాడని నమ్మినందు వల్ల మంచి ఫలము దొరినదని యానందించును. ఏది మంచి క్రియయో యేది క్రియకాదో తెలియని నరుడుగలడా!

# క్రైస్తవమత విషయములు

1. అన్న వస్త్రాదులు ఆశ్రయ స్థానాలు
ఏర్పాటు చేసిన దే మంతబు
మనుజులన్ రక్షించు మనుజులన్ మార్చుట
కేర్పాటుచేసిన దే మతంబు
దేశ దేశాలలో దేవ వాక్యము చాట
నేర్పాటు చేసిన దే మతంబు
విద్య నాగరికత వివిధ వృత్తులు నేర్ప
నేర్పాటుచేసిన దే మతంబు

అంటుమా ప్రయత్నించెవై । ద్యంబు చేయు
శాలలను బెట్టె బైబిలు । సర్వభాష
లకును మార్చె క్రైస్తవమత । మొకటె యట్టి
మంచి పనిచేయునది దైవ । మతముగాదె

2. కులభేద మెంచక కులము లన్నిటిలోని
మనుజులన్ దరిజేర్చు మతమదేది
పరమతస్తుల బిల్చు పరమ మతంబిదె
మళ్ళుడంచును జెప్పుమతమదేది
క్రైస్తవేతర మత గ్రంథముల్ ప్రచురించి
మతపరీక్షకు చెట్టు మతమదేది
క్రైస్తవులకు లోట్లు కలిగినన్ క్రీస్తుని
మహిమ వెల్లడి చేయ మతమదేది
ఆదివార మారాధన । ఆచరించు
వ్రతము గల్గిన వాక్యము విను । మతమదేది

అన్ని దేషలకై వచ్చి । యున్న మతము
మహిని చుట్టిన క్రైస్తవ । మతముగాదె.

3. ధన ధాన్యములవల్ల దారిద్ర్యము గతించు
గాని మోక్షము మీకు గలుగబోదు
విద్యవల్లను తెల్వియుద్యోగము లభించు
గాని మోక్షము మీకు గలుగబోదు
గొప్ప కులమువల్ల గొప్పతనము వచ్చు
గాని మోక్షము మీకు గలుగబోదు
మంచి క్రియవల్ల మంచి పేరు గలుగు
గాని మోక్షము మీకు గలుగబోదు

మనకు మోక్షంబు నిడుటకే । మహికివచ్చి
యేసుక్రీస్తయిన దేవుండు । చేసినట్టి
పనులు నమ్మిన మోక్షము । మనకు దొరుకు
సుళువుగా మోక్షముంజేరు । సూత్రమిదియే

క్రైస్తవ దేశముల యత్నముల వలననే గదా! లోకమునకిపుడు ఉపకార కార్యములు కలుగుచున్నవి. రైలుబండు, బస్సులు, సైకిళ్లు, విమానములు, స్టీమర్లు, టెలిగ్రాములు, వైర్‌లెస్, టెలిఫోన్, బ్రాడ్‌కాస్టు, ఫోటోగ్రాఫ్, సినిమా, ఏక్సరే అనగా శరీర లోపలస్థితి చూపునది. మ్యాజిక్ లాంతరు: దూరమున నున్న వారిని కనబర్చునట్టి టెలివిజన్, గడియారములు, ఎలక్ట్రిసిటి, గ్యాసులైట్స్, అద్దములు వివధములగు యంత్రములు, రూపాయల కాగితములు మొదలైన నానావిధ పరికరములు మరణా యంత్రములు యెంతగానో ప్రబలెను.

1952లో సెప్టెంబర్ నెల ఇండియన్ క్రిస్టియన్ పత్రికలో ప్రచురించిన ప్రపంచ జనసంఖ్యలోని ముఖ్య మతస్థుల జనసంఖ్య:-

1) యూదులు:- ఒక కోటి ఇరువది లక్షలు

2) హిందువులు:- ఇరువదియైదు కోట్ల అరువది లక్షలు.

3) బౌద్ధులు:- పదిహేను కోట్లు

4) క్రైస్తవులు:- డెబ్బది నాలుగుకోట్ల యిరువది లక్షలు

5) మహమ్మదీయులు:- ముప్పది ఒక కోటి అరువదిలక్షలు.

దీనినిబట్టియు, బైబిలు 1135 భాషలలో అచ్చు వేయించుటను బట్టియు, యితర పరోపకార కార్యములను బట్టియు చూడగా క్రైస్తవులు తమ మతవ్యాప్తి నిమిత్తమై బహు ప్రయాస పడుచు న్నట్టు కనబడుచున్నది ఇది శ్లాఘనీయము.

## క్రైస్తవుల వాడుకలు

1. ప్రతి దినము బైబిలు చదువుట
2. ప్రతి దినము ఏకాంత ప్రార్ధన చేయుట
3. ప్రతి దినము కుటుంబ ప్రార్ధన చేయుట
4. ఇతరులకు క్రీస్తును ప్రకటించుట
5. ఆదివారము విధాయకముగా దేవాలయములకు వెళ్ళుట
6. వట్టి చేతులతో వెళ్ళక కానుకలు తీసుకొనివెళ్ళుట
7. అనుదినము పాపవిసర్జన చేయుట
8. అనుదినము ప్రభువు అనుగ్రహించునవి అందుకొనుట
9. లోకములోనున్న అందరియొద్దకుపోయి సువార్తను ప్రకటింపలేము గనుక వారి నిమిత్తమై ప్రార్ధించుట! పత్రికలు పంపుట.
10. బైబిలు సొసైటీ, ట్రాక్ట్ సొసైటీ, ఆసుపత్రి పని, చేతిపనులు వీటినిగురించి సమయమున్నప్పుడు ప్రార్ధించుట, శత్రువులు, స్నేహితులు, బంధువులు, అధికారులు మొదలైన వారిని గూర్చి ప్రార్ధించుట మరి ముఖ్యముగా యితర మతస్థులను గూర్చి ప్రార్ధించుట.

# స్వస్థిశాల

వారు నమ్ముచున్నాము ప్రభువా! అని ఆయనతో చెప్పిరి. అప్పుడాయన వారి కన్నులు ముట్టి మీ నమ్మిక చొప్పున మీకు కలుగును గాక అని చెప్పినంతలో వారి కన్నులు తెరువబడెను మత్తయి 9:29.

గుంటూరు సమీపమందలి కాకానివద్ద నున్న శ్రీ రావుసాహెబ్ జె. రాజారావుగారి తోటలో స్వస్థిశాల యొకటి గలదు. అక్కడకు ప్రతి సోమవారము బైబిలుమిషను పాదుర్లు నలుగురు వచ్చి, సమావేశమైన రోగులకు బోధింతురు.

క్రీస్తుప్రభువు రోగులకు బీదలకు, భూతపీడితులకు, బిడ్డలు లేనివారికి, చిక్కులలో నున్నవారికి, రక్షణమార్గము తెలియనివారికి, పశ్వాదులకు మేలు చేయుచున్నాడు. క్రైస్తవులలోను యితరులలోను కొందరికి ప్రత్యక్షమై మాట్లాడుచున్నారు. ఈ అద్భుత క్రియలు చూచుటకు అప్పుడప్పుడు కొంతమంది వచ్చుచున్నారు. అవస్థలు కలిగి స్వస్థిశాలకు వచ్చుచున్నవారు ప్రస్తుతము వారమునకు 15,000 పెక్కుమంది. బోధించుట బోధకులపని, నమ్ముట ప్రజలపని, బాగుచేయుట క్రీస్తుప్రభువు పని. యేసుక్రీస్తు ప్రభువు దేవుడును, మనుష్యుడును గనుక అన్ని విధముల సహాయము చేయగలడు. తుదకు మోక్షమునకు చేర్చగలడు. ఆయనను ఆశ్రయించి ప్రార్థించండి ఏదోయొక పాపమున్నందువల్లనో, నమ్మిక తక్కువైనందువల్లనో యితర పూజలు మానకయున్నందువలననో కొందరు బాగుపడుటలేదు. ఔషదములు నిషేధములుకావు ప్రార్థించి వేసికొనవచ్చును. యేసుక్రీస్తు వారి శక్తియందు విశ్వాసముంచిన మందులులేకుండా బాగుకాగలరని మా అనుభవము. బాగైనయెడల సంతోషమే. యీ శాలపని నేను స్వయముగా 6-6-1955 తేదీన జూచితిని.

# ప్రశ్నోత్తరములు

1. దేవుడు లేడనియు, ఉన్నయెడల ఆయనను యెవరు కలుగ జేసిరనియు కొందరనుచున్నారు మీరేమందురు?

జ : ఆకాశము, భూమి, అన్నిలోకములు వాటియంతట అవే కలిగినవి అని తలంచువారు దేవుడు కూడి తనంతటతానే కలిగెనని యెందుకు అనుకొనకూడదు.

2. ఉన్నయెడల యెందుకు కనబడడు?

జ : ఆయనతత్త్వము కనబడకుండునట్టి నిరాకారము వస్తువుయొక్క తత్త్వము కనబడునట్టి ఆకారము దేవుని తత్త్వము, వస్తువునకు లేదు. వస్తువు తత్త్వము దేవునికి లేదు. ఈ ప్రశ్న వేయువారు వస్తువునకు యెందుకు నిరాకార తత్త్వములేదు అని అడుగరు? మన తలంపులు మనకు కనబడవుగదా! కనబడనంత మాత్రమున లేవు అని చెప్పవచ్చునా?

3. క్రీస్తును గురించి తెలియనివారు గలరు. తెలిసియు నమ్మని వారు గలరు. వారి గతియేమి? అట్లే యితర మతముల సంగతి యేమి?

జ : క్రీస్తు దేవుడును, మనుష్యుడును గనుక తాను కలుగజేసిన యే మనిషిని, యే మతస్థుని విడిచిపెట్టడు. రక్షింపబడుటకు అందరికిని సమయమిచ్చును. నాకు మోక్షము దొరకదేమో యని యెవరును సందేహింపనక్కరలేదు. ఆయనను ప్రార్థించండి. ప్రార్థించి నమ్మినయెడల మార్గము సరాళ మగును.

4. క్రీస్తు దేవుడని యెందుకు చెప్పుచున్నారు?

జ : ఆయన దేవుడు అని బైబిలు చెప్పుచున్నది రోమా. 9:4,5 "వీరు ఇశ్రాయేలీయులు స్వీకృత పుత్రత్వమును, మహిమయు, నిబంధనలును, ధర్మశాస్త్ర ప్రధానమును, అర్చనాచారాదులును, వాగ్దానములును వీరివి. పితరులు వీరివారు. క్రీస్తు వీరిలో పుట్టెను. ఈయన సర్వాధికారియైన దేవుడైయుండి నిరంతరము స్తోత్రార్హుడైయున్నాడు" ఆమేన్. తీతు 2:12,13 "మనము భక్తిహీనతను, యిహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రధమైన నిరీక్షణ నిమిత్తము అనగా మహాదేవుడును మన రక్షకుడైన యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత నిమిత్తమై యెదురుచూచుచు యీ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించుచున్నది".

5. క్రైస్తవేతర మతమువల్ల యేదియు ప్రయోజనములేదా?

జ : సమస్తమును కలుగజేసిన క్రీస్తు మూలముగ లోకమున ప్రకటనయగుచున్న రక్షణ మార్గములోనికి చేరుకొను మార్గము ఒకటే అన్ని మతములలో ఆ మార్గము కానరాదు దేవుని తలంపులేని మతములేదు.

6. నాస్తికులు దేవుడు లేడనుచున్నారుగదా

జ : వారిని గురించి అందరును అట్లే అనుకొనుచున్నారు. వారి మనస్సులో యేమున్నది మీకు తెలియునా? "దేవుడు ఉన్నట్లు మాకు యెవ్వరైనా ఋజువు పరచినయెడల నమ్ముదుము" అని వారిమనస్సులోనున్నది కనుగొనండి. తాను ఉన్నట్లు తెలియని స్థితి దేవుడు మానవునిలో పెట్టలేదు. అట్లే తానును

క్రీస్తుగా అవతరించిన విషయము అర్ధముకాన్నట్టుగా వ్రాయింపలేదు 1తిమో 1:15 "పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెననువాక్యము నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునైయున్నది. చూచినారా! క్రీస్తుచరిత్ర! నమ్మతగినది, అంగీకరించుటకు తగినది అని యీ వచనమువల్ల కనబడుచున్నది.

7. క్రీస్తు మతము ఈ మధ్యనే వచ్చినది గదా?

జ : సృష్ట్యాదిలో యిన్ని మతములునులేవు, ఇన్ని మిషనులును లేవు, ఇన్ని కులములును లేవు. ఇన్ని భేదములును లేవు. చివరకు అన్నియు ఒకటేయగును. ఎందుకనిన ఆదిలో ఒకటియే, అదే చివరకూడ ఉండును. క్రీస్తుమతము యీ మధ్య అనగా రెండువేల యేండ్ల క్రిందట ప్రత్యక్షమైన సంగతి నిజమేగాని అదివరకు అది ప్రవచన రూపములో నున్నది. సృష్ట్యాది వాగ్ధానములో నున్నది తత్పూర్వము దేవుని అంతరంగములో నున్నది. ఈ మధ్యనే వచ్చిన ఇంజక్షన్, ఎక్స్‌రే మొదలైనవి మనకక్కరలేదా! ఈ మధ్యను వచ్చినవి యక్కరలేని వారుందురా? క్రీస్తు అందరిని పిలుచుచున్నాడు గనుక క్రీస్తుమత మందరి మతము. ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును" మత్తయి 11:28 నా యొద్దకు వచ్చువాని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను యోహాను 6:37 చూడండి! క్రీస్తు పిలుచుటలో నెవరినైన విడిచిపెట్టెనా? మొదటి వచనములో క్రీస్తు

స్వయముగా పిలుచుచున్నాడు. రెండవ వచనములో మనుష్యుడు తన "మనస్సాక్షి" బోధవిని వచ్చుచున్నాడు గనుక క్రీస్తు చేర్చుకొనును.

8. క్రీస్తే రక్షకుడని యెందుకు చెప్పుచున్నారు? బైబిలులో నున్నది గనుక మరి యెవని వలనను రక్షణ కలుగదు "ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశముక్రింద మనుష్యులలో యివ్వబడిన మరియే నామమున రక్షణ పొంద లేము." అపో. 4:12 క్రీస్తే రక్షకుడనియు, ఆయన అందరిని పిలుచుచున్నాడనియు బైబిలులో నున్నది. గనుక అందరును సంతోషించవలసినదే. ఆయనవలె రక్షింపగల రక్షకులున్నారని నమ్మువారు, రక్షణపొందిన తరువాత యెవరడ్డుపెట్టగలరు! ఎవరివలననైన రక్షణ పొందినయెడల మంచిదేగదా! దేవుడు మీకు మరియొక రక్షకుని చూపువరకు మీరక్షకుని విషయమైన నమ్మికలోనే నిలచి యుండవలెను. దిగులు పడకండి తండ్రియైన దేవునియెడల అపనమ్మిక రానీయకండి, సంతోషముతో మోక్ష ప్రవేశము కొరకు నిరీక్షించండి. గొప్ప విషయములు కొన్ని నేర్చుకొన్నవారు యింకను యెక్కువ విషయములు నేర్చుకొనవలెనని యత్నింతురు. ఈ ప్రయత్నము మత సంఘస్థులలోను, లౌకికులలోను కనబడు చున్నది. "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును" మత్తయి 7:7.

9. బాప్తీస్మము పొందితేనేగాని మోక్షము లేదని యెందుకను చున్నారు?

జ : యేసుప్రభువు చెప్పుచున్నమాట వినండి "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి నమ్మి బాప్తీస్మము పొందినవారు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధింపబడును" మార్కు 16:15-16. దీనికి ఒక మినహాయింపు గలదు. వినండి అమెరికాలో లూథరను సంఘముయొక్క గ్రంథకర్తయగు జోసెఫ్‌స్టంపు దొరగారు తన ప్రశ్నోత్తరిలో యిట్లు వ్రాయుచున్నాడు. "బాప్తిస్మమును యెవరు తృణీకరించి, పొందనిష్టపడరో వారికి రక్షణ లేనేలేదు. అయితే బాప్తీస్మము కావలెననికోరియు, పొంద వీలులేనివారికి, పొందని హేతువుచేత నాశనము కలుగదు. బాప్తిస్మము పొందక పోవుటవలన కాదుగాని బాప్తీస్మమును తృణీకరించుటవలననే నాశన శిక్ష గలుగును" నమ్మికలేని బాప్తీస్మమువల్ల యేమి మేలు?

10. అందరును అన్ని విధముల బోధించుచున్నారు. గనుక శాంతి కలుగదు గదా?

జ : నిత్యమును క్రీస్తును తలంచుకొనిన శాంతి కలుగును ఇది సులువైన సూత్రము.

# సువిశేష ధోరణి

**1. సువిశేషము:-** అనగా శుభవార్త. దేవుడు మనుష్యుల విషయమై మంచి కార్యములు చేయువాడు అను వార్తలు శుభవార్తలు. దేవుడు అవతార పురుషుడైన క్రీస్తురాక పూర్వము భక్తులయొద్దకు యేదో ఒక రీతిగా వచ్చుచుండిన రాకడలు ఎన్నోకలవు. నరునికొరకు దేవుడు చేయుకార్యము నరుడు అంగీకరింపనప్పుడు ఆయన రానట్లే. అంగీకరించినప్పుడు ఆయన వచ్చినట్లు.

2. దేవుడు యేసుక్రీస్తుగా నరుడైవచ్చిన రాకడ బహిరంగమైన రాకడ. ఇదే మొదటిరాకడ. అదివరకు వచ్చిన రాకడలు మర్మముగా వచ్చిన రాకడలు క్రీస్తుప్రభువు భూమిమీద ఉన్నప్పుడు నరులు దేవుని స్పష్టముగా చూడగలిగిరి. "నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు" అని క్రీస్తు పలికిన మాట చూడగా దేవుడు వచ్చినాడనియు, ఆయనను నరులు చూచినారనియు తెలియుచున్నది యోహాను 14:9.

3. "ఇద్దరు ముగ్గురు నా నామమున యెక్కడ కూడియుందురో అక్కడ నేను వారిమధ్య ఉందు"నని చెప్పిన మాట చూడగా, నరులు ఎన్నిమార్లు కూడు కొందురో అన్నిమార్లు ఆయన వచ్చునని స్పష్టమగుచున్నది మత్తయి 18:20.

4. ఆయన మేఘాసీనుడైవచ్చి భక్తులను ప్రాణముతోనే ఆకర్షించుకొని వెళ్ళును ఇదే రెండవరాకడ. ఈ రాకడకు సూచనలు మెండుగా జరుగుచున్నందున సమీపము గనుక సిద్ధపడుదుము.

దీనిలో దేవుని వాక్యమున్నది గనుక పాడుకానీయకండి. నరుడు స్వతంత్రుడు గనుక యెవరి మతము వారు ప్రకటింతురు. బేధాభిప్రాయము ఉన్నప్పుడు కలహింపరాదు. ఏ మతములోనున్న ఏ మనుష్యునైనను ద్వేషింపరాదు. మన భూనివాసులను మనము ద్వేషించుట మనలను ద్వేషించుటయగును గదా! తగునా!

# ముగింపు

**చదువరులారా!**

ఇదంతయు చదువుకొని మీరేమి తీర్మానము చేసికొనగలరో మీలోని జ్ఞానశక్తిని, మనస్సాక్షిని సద్వినియోగ పరచుకొన్నయెడల మీ తీర్మానము నిష్కళంకమైనదిగా నుండును. ఈ చిన్న పుస్తకములో నున్న సంగతి పూర్తిగా తెలిసికొనుటకై బైబిలు చదవండి మీరెప్పుడెప్పుడు బైబిలు చదువుదురో అప్పుడు క్రీస్తుప్రభువు మీ చెంతనేయుండును, మిమ్మును దీవించును. అర్థముకాని సంగతుల విషయమై ఆందోళన పడవద్దు. అర్థమగు సంగతులను చూచి ఆనందించండి, అనుసరించగలవి అనుసరించండి. మీరు ఆనందించునప్పుడెల్ల దేవుని స్తుతించండి. మీలో ఉన్న ప్రతి మంచిని చూచి దేవుడానందించును. ఉభయులకును ఆనందవే. దైవసహవాసము గలవారెంత ధన్యులు! తండ్రి సన్నిధియందుండుట పిల్లలకెంత సంతోషము! జీవ మార్గమును నీవు నాకు తెలియజేసెదవు నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు. నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు అని ఒక భక్తుడు చెప్పుచున్నాడు దా.కీర్తనలు 16:11.

షరా:- ఈ పత్రిక శాంతముగాను సాంతముగాను చదివి దైవ ప్రార్థన చేయువారికి నిత్యానందాశీస్సు కలుగును గాక!

# సువిశేష ధోరణి

గ్రంథకర్త

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2025. చందా : 7.00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1967 | పతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1983 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1991 | ప్రతులు | 2000 |
| నాల్గవ | ముద్రణ | 1998 | ప్రతులు | 5000 |
| ఐదవ | ముద్రణ | 2016 | ప్రతులు | 2000 |
| ఆరవ | ముద్రణ | 2018 | ప్రతులు | 3000 |
| ఏడవ | ముద్రణ | 2021 | ప్రతులు | 3000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2024 | ప్రతులు | 1000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2025 | ప్రతులు | 1000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలు పరచిన

# బైబిలు మిషను ప్రచురణ

ముద్రణ :

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్ : 9949121777.


Bible Mission HQ Guntur